క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి

చీరాల టౌన్: పంచాయతీల కార్యదర్శులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించి పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీడీఓ బి.శివన్నారాయణ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల సెక్రటరీలు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామ సచివాలయాలను తనిఖీలు చేసి పెండింగ్ అర్జీలను విచారించినట్లు తెలిపారు. ప్రజలు వచ్చిన అర్జీలను నిసితంగా విచారించి అర్హులైన ప్రతి ఒక్కరి సమస్యకు పరిష్కారం అందించాలన్నారు. ప్రభుత్వ సేవలను సత్వరం అందించేందుకు సచివాలయాల సిబ్బంది అంకితభావంతో పని చేయాలని సూచించారు. సచివాలయం ద్వారా అందించే సేవలను నిర్ణీత సమయంలోగా అర్జీదారులకు అందించాలని కోరారు. గ్రామ పంచాయతీలకు కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించి అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పంచాయతీల కార్యదర్శులు ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రజలకు అందించే సేవల్లో అలసత్వం వహించిన వారిపై చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఈవోఆర్డీ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లున్నారు.

క్యూ ఆర్ కోడ్‌తో ఆరోగ్య వివరాలు



మాట్లాడుతున్న బీవీ సాగర్

అద్దంకి: ఎయిడ్స్ నియంత్రణ సంస్థ తయారు చేసిన క్యూ ఆర్‌కోడ్ స్కాన్ చేయడం ద్వారా మీ ఆరోగ్య పరిస్థితిని నిమిషాల్లో తెలుసుకోచ్చని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్ అన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీ నగర్ కాలనీలో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. దానిలో భాగంగా ఎయిడ్స్ ఎలా సంక్రమిస్తుంది, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని తదితర వివరాలను తెలియజేశారు. ప్రకాశం బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డీఎస్ పద్మావతి, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరుసు మహోత్సవం నేడు



మేదరమెట్లలో ఉరుసు కార్యక్రమానికి ముస్తాబైన దర్గా

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామంలో వెలిసిన హజరత్ సయ్యద్ కరిముల్లా షా ఖాదరి దర్గా వద్ద గురువారం 42వ ఉరుసు మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామంలో ఊరేగింపు ఉంటుందని.. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.

40 మందికి నిత్యావసరాల అందజేత



పేదలకు సరుకులు అందిస్తున్న దాతలు

చినగంజాం: ప్రభుత్వం గుర్తించిన పేద కుటుంబాలు, దివ్యాంగులకు దాత నరహరి శ్రీనివాసరావు నిత్యావసరాలు అందజేశారు. బుధవారం స్థానిక వెలుగు డీఆర్డీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో.. నెల రోజులకు సరిపోయే సరుకులను అందజేశారు. మండలంలో పీ4 సర్వేలో గుర్తించిన 22 పేద కుటుంబాలు, 18 మంది దివ్యాంగులకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం తరఫున గాని, దాతల ద్వారా గాని ప్రతి నెలా 10వ తేదీన లబ్ధి చేకూర్చే కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. సర్పంచ్ రాయని ఆత్మారావు, ఉప సర్పంచ్ సీహెచ్ రాఘవరావు, పాద వీరయ్య, యార్లగడ్డ లక్ష్మి, సారథి, దివ్యాంగుల సమాఖ్య అధ్యక్షురాలు విశ్రాంతమ్మ, సారిధి, శారద, ఆజాద్ నరసింహారావు, తుమ్మలపెంట శ్రీను, జయరావు, లక్ష్మీనారాయణ, యేసు నారాయణ పాల్గొన్నారు.

ఆటల పోటీలు రేపు

కారంచేడు: మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం పలు రకాల ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ ఎంపీ సత్యాన్నారాయణ తెలిపారు. బుధవారం స్థానిక యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మాట్లాడారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన మండల స్థాయి అండర్ 14, అండర్ 17 విభాగాల్లో అథ్లెటిక్స్‌లో బాల, బాలికలకు పోటీలు జరుగుతాయన్నారు. హెచ్ఎం సామ్రాజ్యం, పీడీ షేక్ మస్తాని పాల్గొన్నారు.

పారిశుద్ధ్య లేమితో ఇక్కట్లు



కొత్తపాలెం ప్రధాన రహదారిలో పేరుకుపోయిన చెత్త కుప్పలు



గవినివారిపాలెంలో దోమలకు కేంద్రాలుగా ఉన్న మురుగునీటి నిల్వ

- చెత్తమయంగా గ్రామాలు
- కన్నెత్తి చూడని ప్రత్యేకాధికారులు
- పొంచి ఉన్న రోగాలు

చీరాల టౌన్: పారిశుద్ధ్యలేమి రోగాల వ్యాప్తికి కారణమవుతోంది. సుభిక్షంగా ఉండాల్సి పల్లెల్లో చెత్త కుప్పలు.. మురుగు తాండవిస్తుండటంతో జనం తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, ఎంపీడీవో, నియోజకవర్గానికి ప్రత్యేకాధికారులున్నా ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఫలితంగా గ్రామాలన్నీ చెత్తా, చెదారాలు, వ్యర్థాలతో నిండి పోతున్నాయి. మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. ఎవరైనా జిల్లా అధికారో, ప్రజా ప్రతినిధులు వస్తే మాత్రం కేవలం ఆ పరిసరాలను మాత్రం శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లిస్తున్నారు. మండలంలోని దేవాంగపురి, ఈపురుపాలెం, గవినివారిపాలెం, వాడరేవు గ్రామాలు జనాభాపరంగా, ఆదాయపరంగా ఎక్కువైనవి.. కానీ ఈ గ్రామాల్లో పారిశుద్ధ్య సిబ్బంది అరకొరగా ఉండటంతో పరిశుభ్రత కనుచూపు మేరలో కనిపించడంలేదు. చీరాల మున్సిపాలిటీకి చేరువగా ఉన్న కొత్తపాలెం, గాంధీ నగర్, సాల్మన్ సెంటర్ పంచాయితీలకు ఆదాయం ఉన్నప్పటికీ ఫలితం శూన్యం. ఉత్సవ విగ్రహాల్లా డివిజన్, జిల్లా స్థాయి అధికారులను ప్రత్యేకాధికారులు వ్యవహరిస్తున్నారు. మురుగు దెబ్బకు దోమలు ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్నాయి.

చర్యలు తీసుకుంటాం

గ్రామ పంచాయతీల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు ఆదేశాలిచ్చాం. క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనులు చేసి గ్రామాల్లో మురుగునీరు, చెత్తకుప్పలు లేకుండా చేయాలన్నాం. దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయాలని సూచించాం. సక్రమంగా పని చేయని కార్యదర్శులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

– శివన్నారాయణ, ఎంపీడీఓ

సేంద్రియ ఎరువులు వాడండి



జె.పంగులూరు: మాట్లాడుతున్న ఏపీ సుబ్బారెడ్డి

చినగంజాం: పంటలకు యూరియా అధికంగా వాడటం అనర్థదాయకమని మండల వ్యవసాయాధికారి ఆర్. చంద్రశేఖర్ తెలియజేశారు. బుధవారం మండలంలోని పెదగంజాం, నీలాయపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో యూరియా కొరత లేదని పలు గ్రామాల్లో సొసైటీలు, రిటైలర్ డీలర్‌లు, రైతు సేవాకేంద్రాల్లో యూరియా నిల్వలున్నాయని తెలిపారు. యూరియా అధికంగా వాడటం వలన పంటలు తెగుళ్లు, పురుగులు బారిన పడి నష్టం వాటిల్లే అవకాశం ఉందని తెలిపారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వినియోగించాలని.. నానో యూరియా అర లీటర్ బాటిల్ ధర రూ. 225 ఉందని ఇది ఒక బస్తా యూరియాతో సమానమని తెలిపారు. యూరియా వినియోగం వలన పంట ఏపుగా పెరుగుతుందని, నీటి కాలుష్యం జరగదని తెలిపారు. ప్రతి రైతు విధిగా పంట నమోదు కార్యక్రమం చేయించుకోవాలని సూచించారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ రసాయన ఎరువుల కలయిక ఉపయోగించి నేల ఆరోగ్యాన్ని మెరుగు పరచాలని కోరారు. సాంబశివరావు, లలితప్రియ, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామాల రైతులు పాల్గొన్నారు.



నీలాయపాలెంలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి చంద్రశేఖర్

జె.పంగులూరు: యూరియా అధికంగా వాడటాన్ని నివారించాలని.. మండల వ్యవసాయాధికారి డి. సుబ్బారెడ్డి అన్నారు. మండల పరిధిలోని అలవలపాడు, జాగర్లమూడివారిపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. వ్యవసాయ సహాయకులు చిన్నబాబు, గోపి కిరణ్ రైతులున్నారు.

సస్యరక్షణతో చీడపీడల నివారణ

బల్లికురవ: పత్తి పంటలకు చీడపీడలు ఆశించాయని సమగ్ర సస్య రక్షణ చర్యలతో నివారించుకోవచ్చని వ్యవసాయాధికారి పి. శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం నక్కబొక్కలపాడు, మల్లాయపాలెం గ్రామాల్లో ప్రత్తి పంటను పరిశీలించి సూచనలిచ్చారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగలు

వేటపాలెం: గ్రామంలో చీరాల–ఒంగోలు ప్రధాన రహదారి పక్కన అపార్టు మెంట్ దగ్గరలో కరెంటు స్తంభానికి పిచ్చి తీగలు అలు ఎగబాకాయి. అలాగే విద్యుత్ తీగలకూ అల్లుకు కుంటూ పోయాయి. వర్షాకాలం విద్యుత్ తీగలకు విద్యుత్ ప్రహించే సయంలో ఈ అల్లుకున్న తీగలు వల్ల తరచూ విద్యుత్ సరఫరా నిలిచి పోతోంది. ట్రాన్స్‌ఫార్మర్‌కు చెందిన ఫ్యూజులు పోయే అవకాశం ఉంది. వీటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సంపద సృష్టించేది కార్మిక వర్గమే!

చీరాల అర్బన్: సంపద సృష్టించేది కార్మిక శ్రామిక వర్గం మాత్రమేనని, అయితే ప్రధాని మోదీ పెట్టుబడిదారులే సందప సృష్టిస్తున్నారని చెప్పడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్ అన్నారు. బుధవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సీఐటీయూ పట్టణ తృతీయ మహాసభను నిర్వహించారు. సీనియర్ నాయకులు ఐవీ ప్రసాదరావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కార్మిక వర్గమే సంపద సృష్టిస్తోందని, అయితే ప్రధాని మాత్రం పెట్టుబడిదారులే సంపద సృష్టిస్తున్నారని చెబుతున్నారన్నారు. బ్యాంకు రుణాలను రద్దు చేయడం జరుగుతుంటే, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని అడిగితే బడ్జెట్ లోటు కారణం చెబుతున్నారని మండిపడ్డారు. నిరుద్యోగం భారీగా పెరుగుతుంటే ప్రభుత్వ రంగ సంస్థలను చౌకగా ప్రైవేటుదారులకు అప్పగిస్తున్నారని విమర్శించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ ప్రజలు పోరాడి సాధించుకున్న ఆస్తిని ప్రైవేటీకరణ చేస్తుంటే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు కేంద్ర ప్రైవేటీకరణ చేస్తుంటే చూస్తూ ఉండే పరిస్థితిలో ఉందన్నారు. పట్టణ కన్వీనర్‌గా ఎం.వసంతరావు ఎన్నికై 25 మందితో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. జి.సుధాకర్, పి.ప్రమీల, వీరాస్వామి, శీలమ్మ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మజుందార్

కామ్రేడ్ వాసంశెట్టి సేవలు మరువలేనివి

చీరాల అర్బన్: ఐఎల్టీడీ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు వాసంశెట్టి వెంకటరావు చిరస్మరణీయులని, ఆయన సేవలు మరువలేనివని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గోసాల సుధాకర్ అన్నారు. బుధవారం స్థానిక చీరాల ఐఎల్టీడీ యూనియన్ కార్యాలయంలో ఐఎల్టీడీ వర్కర్స్ ఫెడరేషన్ సీఐయూ యూనియన్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు వాసంశెట్టి వెంకటరావు మొదటి వర్ధంతి సభను నిర్వహించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ వాసంశెట్టి వెంకటరావు సుమారు 40 సంవత్సరాలుగా యూనియన్ నాయకుడిగా పని చేసి కార్మికుల సమస్యల పరిష్కారంలో నిరంతరం కృషి చేశారన్నారు. ఆయన మరణం కార్మిక ఉద్యమానికి తీరని లోటన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ కార్మిక హక్కుల సాధనకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్రాంచి అధ్యక్షుడు బోయిన పోతురాజు, కార్యదర్శి కుందుర్తి నీలాంబ్రం, నాయకులు నక్కల నాగరాజు, పఠాన్ కాలేషా, పెరుగు తిరుమలరావు, కె.ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.



వర్ధంతి సభలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

విగ్రహ నిర్మాణాలకు భూమి పూజ

కారంచేడు: మండలంలోని కేశవరప్పాడు గ్రామంలో నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహాలు నెలకొల్పేందుకు భూమి పూజ నిర్వహించామని ఎంఆర్‌పీఎస్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు చిరుమల సుధాకర్ మాదిగ అన్నారు. బుధవారం కేశవరప్పాడులో ఏర్పాటు చేయనున్న విగ్రహాలకు భూమిపూజ చేశారు. ప్రతి గ్రామంలో వారి విగ్రహాలు ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామన్నారు. దాతల సహకారంతో ఈ విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీహెచ్ పిచ్చియ్య, జేమ్సు, పున్నయ్య, కృపారావు, రాజియ్య, క్రాంతి కుమార్, సుబ్బయ్య, బుచ్చిబాబులు పాల్గొన్నారు.



కేశవరప్పాడులో విగ్రహ నిర్మాణ భూమిపూజలో పాల్గొన్న సుధాకర్ మాదిగ

రుణాలతో ఆర్థిక పురోగతి

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందిస్తున్న రుణాలను సక్రమంగా వినియోగించుకోవడంతో పాటుగా మొబైల్ బుక్ కీపింగ్‌ను నిర్వహించాలని ఏపీఎం కె.మధుసూదనరావు సూచించారు. బుధవారం బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో మండల సమాఖ్య సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడారు. పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధి పెంచేలా పొదుపు సంఘాల మండల సమాఖ్య వీఏవోలు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రూపు విధిగా ప్రతినెలా 10తేదీ సమావేశాన్ని నిర్వహించుకుని గ్రూప్‌ల మొబైల్ కీపింగ్‌ను 100 శాతం పూర్తి చేయాలన్నారు. స్త్రీనిధి రికవరీలు పూర్తిగా వసూళ్లు చేయాలన్నారు. సూర్య ఘర్ పథకాన్ని పొదుపు సభ్యులకు వివరించి సోలార్ ఏర్పాటు చేసుకునేలా కృషి చేయాలన్నారు. ప్రతి గ్రూపు తీసుకున్న రుణాలను కేవలం స్వయం సహకారం పెంపొందించుకునే సంస్థలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామ పొదుపు సంఘాల్లో మహిళలు విధిగా నెలవారీ వాయిదాల రుణాల చెల్లింపులో అలసత్వం వహించకూడదన్నారు. ఉన్నతి పథకంలో రుణాలు తీసుకున్న పొదుపు మహిళలు విధిగా రుణాలు చెల్లించాలని, పెండింగ్‌లో లేకుండా గ్రూపు లీడర్లు కృషి చేసేలా వీఏవోలు ప్రతి గ్రూపును పరిశీలించాలన్నారు.

ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోండి

మేదరమెట్ల: స్త్రీ శక్తి పథకం అమలు ద్వారా ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ఆర్థిక సాయం అందచేయాలని వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలంటూ కొరిశపాడు మండలంలోని ఆటో డ్రైవర్లు బుధవారం తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ ఉచిత బస్సు పథకాన్ని పెట్టిన తరువాత తమ ఉపాధి పోయిందని లక్షలు ఖర్చుపెట్టి అప్పులు చేసి మరీ కొనుక్కొన్న ఆటోలను ఖాళీగా ఉంచాల్సి వస్తోందన్నారు. ఆటోలు ఎక్కే వారు కరువయ్యారని దీంతో తమ కుటుంబ ఖర్చులకు అప్పులు చేయాల్సి వస్తుందని అప్పులు దొరకని వారు పస్తులు ఉంటున్నామన్నారు. గత ప్రభుత్వంలో ఆటో డ్రైవర్లకు ఏడాదికి ఆటో మరమ్మతులకు కొంత సొమ్ము ఇచ్చేవారని.. కూటమి ప్రభుత్వం వచ్చాక అలాంటిది ఏమీ లేక పోయినా ఆర్టీవో, పోలీసులు మాత్రం చలానాల పేరుతో తమను వేధిస్తున్నారన్నారు. ప్రతి కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సాయం అందించాలని, ఆటో వర్కర్లందరికీ పెన్షన్ ఇప్పించాలని, ఆటో డ్రైవర్లందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మేదరమెట్ల సెంటర్‌లో ర్యాలీ నిర్వహించిన ఆటోడ్రైవర్లు మండల కేంద్రమైన కొరిశపాడు తహసీల్దార్ కార్యాలయానికి ఆటోలతో ర్యాలీగా వెళ్లి వినతి పత్రాన్ని అందించారు.



కొరిశపాడులో తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న ఆటో డ్రైవర్లు

దంత సంరక్షణతో ఆరోగ్యం



విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చీరాల అర్బన్: దంతాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటారని దంత వైద్యులు సూచించారు. రోటరీ క్లబ్ చీరాల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎస్ఆర్‌పీఎం హైస్కూల్‌లోని 300 మంది విద్యార్థులకు ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. డాక్టర్లు ఐ.బాబూరావు, బి.రవితేజ, ఎం.అబ్రహం బ్లెస్సీ, ఎస్‌పీ ప్రత్యూష, మేఘ సాయి, ఎం.మహతి, ముద్దన నాగేశ్వరరావుచే ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించి పరీక్షలు చేశారు. డాక్టర్లు మాట్లాడుతూ విద్యార్థులు బలవర్థకమైన ఆహారం తీసుకుంటూ భోజనం చేసిన తర్వాత, తీపి పదార్థాలు తిన్న తర్వాత నోటిలో నీరు పోసుకొని దంతాలను కడుక్కోవాలన్నారు. రాత్రి నిద్రపోయే ముందు బ్రష్‌తో దంతాలను శుభ్రం చేసుకోవాలన్నారు. ఏదైనా దంత సమస్య వస్తే వైద్యుడిని సంప్రదించాలన్నారు. అనంతరం రూ.15వేలు విలువ అయిన బ్రష్‌లు, పేస్టులు, బిస్కెట్ ప్యాకెట్లును విద్యార్థులకు అందించారు. క్లబ్ సభ్యులు జాలాది కృష్ణమూర్తి, తిరుమలశెట్టి లక్ష్మీప్రతాప్, పోలుదాసు రామకృష్ణ, డీపీ సురేష్, బాలవెంకటేశ్వరరావు, శివాంజనేయప్రసాద్, జీవై ప్రసాద్, మామిడాల శ్రీనివాసరావు, శంకరరెడ్డి, జి.రమేష్, హెచ్ఎం బి.సాల్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం



పాఠశాలలో సన్మానం అందుకుంటున్న ఉపాధ్యాయులు

ఇంకొల్లు(చినగంజాం): గురుపూజోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయుడు ఆచార్య రంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు ఉప్పల చెంచయ్యను బుధవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు.

కార్యక్రమానికి పాఠశాల హెచ్ఎం కటారి భాస్కరరావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ ఏ. శ్రీనివాసరావు మాట్లాడుతూ సైన్స్ ప్రయోగ శాలను తరగతిగా మార్చుకొని అందుబాటులో ఉన్న పరికరాలను, ప్రయోగాలను విద్యార్థులకు వివరిస్తూ భౌతిక శాస్త్ర బోధన చేసిన చెంచయ్య మాస్టారు ఆదర్శనీయుడన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ జరుగులు బాలకృష్ణ,ఉప సర్పంచ్ మన్నెం చింపిరయ్య, గ్రామ పెద్దలు ముప్పాళ్ళ ప్రసాద్, చెన్నుపాటి జనార్దన్, చెంచయ్య సేవలను కొనియాడుతూ సత్కరించారు. అదే విధంగా పాఠశాలలోని విద్యార్థులందరికీ ఐడెంటీ కార్డులను అందజేసిన హిందీ ఉపాధ్యాయుడు బట్ట బాలసుబ్రహ్మణ్యంను సత్కరించారు. పాఠశాల ఉపాధ్యాయులు కె. శంకరరావు, శ్రీనివాసాచార్యులు, విజయకుమారి, చినబాబు, వెంకటరావు, సువర్చల, శిరీష, వెంకటేశ్వరరావు, అన్నం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బస్సులు లేక అవస్థలు



అద్దంకి బస్టాండ్‌లో బస్సుల కోసం పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

అద్దంకి రూరల్: అనంపురంలో జరిగిన సూపర్‌సిక్స్.. సూపర్ హిట్ కార్యక్రమానికి అద్దంకి డిపోలోని బస్సులు వెళ్లటంతో ప్రయాణికులు బుధవారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అద్దంకి నుంచి ఇంకొల్లు, వినుకొండ, పొదిలి, ఈదర, తాళ్లూరు, నాగులుప్పలపాడు గ్రామాలకు వెళ్లాల్సిన బస్సులు లేకపోవటంతో ప్రయాణీలు బస్టాండ్‌లకే పరిమతమయ్యారు. గురువారం ఉదయం నుంచి యథావిధిగా బస్సులు నడుస్తాయని డిపో మేనేజర్ రామ్మోహనరావు తెలిపారు.

ప్రజల వద్దకు డిజిటల్ సేవలు



మాట్లాడుతున్న మెప్మా పీడీ ఆనంద్ సత్యపాల్

చీరాల అర్బన్: డిజిటల్ సేవలను ప్రజలకు దగ్గర చేర్చేందుకు కియోస్కి సెంటర్లు ఏర్పాటు చేయాలని మెప్మా పీడీ డి.ఆనంద్ సత్యపాల్ అన్నారు. బుధవారం చీరాల మున్సిపాలిటిలోని మెప్మా విభాగం అధికారులతో సమావేశమయ్యారు. జీవనోపాధుల పెంపుదల వాటిని పర్యవేక్షిస్తూ 220 మంది ఎంపిక చేసిన లబ్దిదారులకు రుణాలు అందజేయాలన్నారు. సూర్యఘర్ లబ్దిదారులకు త్వరితగతిన అవగాహన కల్పించి సోలార్ ప్యానల్స్‌ను లోన్ ద్వారా అందజేయాలన్నారు. మెప్మా సీఎంఎం కొండయ్య, సీఓలు రత్నకుమారి, సుబ్బారావు, శేషారత్నం, సతీష్, అనిల్‌కుమార్, ఆర్‌పీ విజయలక్ష్మి పాల్గొన్నారు.